క్లుప్తంగా

టీకాల కార్యక్రమం తనిఖీ



మహిళతో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ ఉమా

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని పెద్ద పాడు, వీకర్‌సెక్షన్ కాలనీల్లో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యువిన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. ముఖ్యంగా మీజిల్స్, రుబెల్లా ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంఆర్ 1, ఎంఆర్ 2 టీకాలను వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు.

20న కుటుంబ ఆశీర్వాద కూడిక



కుటుంబ ఆశీర్వాద కూడిక పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఈఎస్‌టీ సభ్యులు

కర్నూలు (టౌన్): ఈనెల 20 వ తేదీ స్థానిక రాక్‌వుడ్ చర్చిలో కుటుంబ ఆశీర్వాద కూడిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇవాంజికల్ సపోర్టింగ్ టీమ్ ఫౌండర్, డైరెక్టర్ దాసరి సు. దీర్ వెల్లడించారు. శనివారం స్థానిక రాక్‌వుడ్ చర్చిలో సంఘ కాపరి జీవన్‌రావు, సంఘం అధ్యక్షుడు పి. ఆనందరావులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు పట్టణంలోని అన్ని డినామినేషన్లు, సంఘాలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కుటుంబ ఆశీర్వాద కూడికలో దైవ సందేశకులు డాక్టర్ కొరియన్ దేవుని వాఖ్యం భోదిస్తారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కన్వీనర్ మోజెస్, కార్యదర్శి బందారు విజయకుమార్, కోశాధికారి మల్లెపోగు రాజు, సురేష్, జయాకర్, ఆరాధన టీవీ కోఆర్డినేటర్ జాన్ పాల్ పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి బొకే అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ

కోడుమూరు రూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికైన మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ శనివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మణిగాంధీ మాట్లాడుతూ జగనన్న తనపై ఎంతో నమ్మకంతో పార్టీ పదవి ఇచ్చారన్నారు. కోట్ల హర్ష మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలంతా కలిసి కట్టుగా పనిచేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

7న విజయవాడలో ధర్నా

గడివేముల: ఈనెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు తెలిపారు. శనివారం గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నప్పటికీ ఉపాధ్యాయ, ఉద్యోగుల పరిష్కారంలో ఎలాంటి చొరవ చూపకపోవడం తగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టనున్న ధర్నాకు ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: కాంతార : ఎ లెజెండ్ – చాప్టర్ 1, ఓజీ, మిరాయ్, సన్నీ సంస్కారీ కి తులసి కుమారి, ఇడ్లీ కొట్టు
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్: కాంతార : ఎ లెజెండ్ – చాప్టర్ 1, ఓజీ, మిరాయ్, ఇడ్లీ కొట్టు
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : లిటిల్ హార్ట్స్, ఓజీ, మిరాయ్
శ్రీరామ : కాంతార : ఎ లెజెండ్ – చాప్టర్ 1
రాజ్ : కాంతార : ఎ లెజెండ్ – చాప్టర్ 1
భరత్ కాంప్లెక్స్: కాంతార : ఎ లెజెండ్ – చాప్టర్ 1, ఇడ్లీ కొట్టు
విజయ: ఓజీ
విక్టరీ : లిటిల్ హార్ట్స్

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

- నవరాత్రుల్లో పూజలు అందుకున్న అమ్మవారికి ఘన వీడ్కోలు
- శోభాయమానంగా సాగిన దుర్గా మాత విగ్రహాల ఊరేగింపు
- ప్రత్యేక ఆకర్షణగా మహిళల కలశ యాత్ర



తుంగభద్ర నది తీరంలో దుర్గామాతను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



నిమజ్జన కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్సవం కనుల పండువగా సాగింది. దసరా శరన్నవరాత్రుల్లో తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న దుర్గమ్మకు సంకల్ బాగ్ తుంగభద్ర నది తీరం దుర్గా ఘాట్‌లో శనివారం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కర్నూలు నగర పాలక సంస్థ, టీజీవీ ట్రస్ట్, దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్స సమితి, టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ దీపికా పటేల్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య జ్యోతి ప్రజ్వలన చేసి గంగమ్మకు పూజలు నిర్వహించారు. రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించి దుర్గా మాత నిమజ్జనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఇందుకు దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేందుకు 25 సంవత్సరాల కిత్రం దుర్గా ఉత్సవాలను ప్రారంభించామన్నారు. భక్తులు, నిర్వాహకులు అధిక సంఖ్యలో దుర్గా విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

వైభవంగా శోభాయాత్ర

నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువు దీరిన దుర్గా మాత విగ్రహాల నిమజ్జన సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా సాగింది. మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాటాలు, భజనలతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి శిష్య బృందం నిర్వహించిన తుంగా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా, సంగీతం టీచర్ నాగమల్లీశ్వరి శిష్య బృందం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తుంగభద్ర నదితో పాటు, కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, సమితి సభ్యులు దాశెట్టి శ్రీనివాసులు, మహబలేష్, ఎలమర్తి రమణయ్య, విఠల్‌శెట్టి, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ తదితరులు



ఘాట్ వద్ద బాలికల నృత్య ప్రదర్శన



శోభాయాత్రలో భక్తుల కోలాహలం

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు ఆమె వివరించారు.అలాగే అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలోఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆమె వెల్లడించారు. meekosam. ap. gov. in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఫయాజ్

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆదోని అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఫయాజ్ అహ్మద్ నిజామిని నియమించారు. ఈ విషయాన్ని శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆ మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని రెండో వార్డు ఖల్లా వీధిలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండీ షరీఫ్, నాయకులు డి.ఖాజాపాషా, చాంద్‌పాషా డిమాండ్‌చేశారు. శనివారం సీపీఎం బృందం శిథిలమైన మరుదొడ్లను పరిశీలించారు. వెంటనే ట్యాంకులో నీటిని నింపాలని, చిన్న, చిన్న మరమ్మతు పనులు చేపట్టి వినియోగంలోకి తేవాలన్నారు.

ఆటోడ్రైవర్లకు అండ



మెగా చెక్‌ను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు (టౌన్) : రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. శనివారం నగరపాలక కార్యాలయంలో విజయవాడ నుంచి ఆటో డ్రైవర్ సేవ పథకం ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆటో ఫిట్నెస్, ఆటో రిపేరీలు, ఇన్సూరెన్స్ కోసం ఏడాదికి రూ.15 వేలు ఇస్తుందన్నారు. జిల్లాలో 13,495 మంది ఆటో, మ్యాక్సీ, క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ఆటో డ్రైవర్ సేవా పథకం కింద సాయం అందించినట్లు వెల్లడించారు. కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సమావేశంలో కమిషనర్ పి. విశ్వనాథ్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర్ యాదవ్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సర్దార్ అమరావతమ్మ చిరస్మరణీయురాలు



అమరావతమ్మకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్ : దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధురాలు సర్దార్ అమరావతమ్మ అని రాయలసీమ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంధం అరుణ అన్నారు. బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో శనివారం టీజీవీ కళాక్షేత్రంలో సర్దార్ అమరావతమ్మ 53వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతమ్మ పోరాటం, సేవలు చిరస్మరణీయమన్నారు. మహిళలు గుమ్మం దాటి బయటకు రాని పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు వచ్చి సర్దార్ నాగప్పతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ధీశాలి అమరావతమ్మ అని బహుజన విద్యావంతుల వేదిక అధ్యక్షులు దాసరి రామశేషయ్య అన్నారు. కార్యక్రమంలో సర్దార్ నాగప్ప, అమరావతమ్మ కుమార్తెలు మీనాక్షి సుందరరాజన్, వెంకట మహాలక్ష్మి, విజయలక్ష్మి, కోడళ్లు జ్ఞాన సుందరి, దేవి ఉమామహేశ్వరి, దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దామోదరం రాధాకృష్ణమూర్తి, హేతువాద సంఘం నాయకులు సీబీ వర్మ, డాక్టర్ గోవర్ధన్, బహుజన విద్యావంతుల వేదిక కార్యదర్శి పెరికల రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ఇచ్చి కూతురిని కాపాడుకున్న తల్లి



ప్రత్యూష, జయమ్మలతో వైద్యుల బృందం

కర్నూలు (హాస్పిటల్) : రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న కూతురికి షుగర్‌తో బాధ పడుతున్నా లెక్క చేయకుండా ఓ తల్లి తన కిడ్నీ ఇచ్చి కాపాడుకుంది. వివరాలను శనివారం కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ హెరూర్ వివరించారు. డోన్‌కు చెందిన ప్రత్యూష (34) కొన్ని సంవత్సరాలుగా రెండు కిడ్నీలు విఫలమై బాధ పడుతున్నారు. ఆమె బాధ చూడలేక తల్లి జయమ్మ (55) కిడ్నీ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఇద్దరిదీ ఎ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కావడంతో వైద్యులు సైతం అంగీకరించారు. అయితే జయమ్మకు బ్లడ్ షుగర్ ఉండటంతో కిడ్నీ ఇవ్వొద్దని పలువురు సూచించినా వినకుండా ఆమె ముందుకు కదిలారు. ఈ మేరకు గత జులై 14న మెడికవర్ హాస్పిటల్‌కు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకుని షుగర్‌ను నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఈనెల 24న తల్లి, కూతురిని ఆసుపత్రిలో చేర్చుకుని కిడ్నీ మార్పిడికి అవసరమైన పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ మార్పిడికి షుగర్ వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధారణ కావడంతో 27వ తేదీన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఇద్దరూ కోలుకోవడంతో శనివారం వారిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి



సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : ఎన్నికల హామీ మేరకు వెంటనే గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చంద్రబాబు నాయుడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దిన్నెదేవరపాడు, అంబేద్కర్ నగర్, టీజీవీ కాలనీల్లో నివాసం ఉండే అనేక మంది ఇళ్ల స్థలాలు లేకపోవడంతో బాడుగ ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తే పేదలు సొంతింటి కలను సహకారం చేసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువు



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ లేకుండాపోయిందని, విజయవాడలోని భారీ విగ్రహాన్ని కూడా గతంలో కొందరు దుండగులు పెకిలించే ప్రయత్నం చేశారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. తాజాగా చిత్తూరు జిల్లాలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి నిప్పుపెట్టడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం కర్నూలు న్యూసిటీ కేవీపీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి నిప్పు పెట్టడం రాజద్రోహంగా పరిగణించాలన్నారు. ఇది దుండగుల చర్య కాదని, మత ఉన్మాదుల పని అని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఏసు, ఎం.భాస్కర్, అబ్దుల్లా, నాగరాజు పాల్గొన్నారు.

మీ వేధింపులు భరించలేం!

మునిసిపల్ కమిషనర్ తీరు పట్ల విసిగిన ఉద్యోగులు

- తాజాగా రెవెన్యూ సూపరింటెండెంట్‌కు అవమానం
- గెటౌట్.. సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరిక
- కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని వెల్లడి
- సూపరింటెండెంట్‌కు ఉద్యోగుల మద్దతు



సెంట్రల్‌ప్లాజా వద్ద డినైడర్ల మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్ (ఫైల్)



కమిషనర్ తీరుపై మేయర్ బీవై రామయ్యకు ఫిర్యాదు చేస్తున్న సూపరింటెండెంట్, మున్సిపల్ ఉద్యోగులు

కర్నూలు (టౌన్) : కర్నూలు నగర పాలక కమిషనర్ పి. విశ్వనాథ్ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నిత్యం సమీక్షలు, సమావేశాలు, ఎక్కడున్నారో తెలుసుకోకుండా వెంటనే కార్యాలయానికి రమ్మనడం, కారణం వినకుండా దండించడం ఈ మధ్య ఎక్కువైందని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ రెండున్నర నెలల వ్యవధిలోనే పలువురికి షోకాజ్‌నోటీసులు, 20 మందికి పైగా ఉద్యోగులకు మెమోలు, ముగ్గురు ఉద్యోగులకు సస్పెన్షన్‌లు జారీ అయ్యాయి. కింది స్థాయి ఉద్యోగులనే కాకుండా సెక్షన్ హెడ్‌లకు కూడా ఈ కొత్త కమిషనర్ మెమోలు జారీ చేస్తున్నారు. ఇలా గతంలో ఎప్పుడూ జరగలేదని.. అప్పగించిన పనులన్నీ చేస్తున్నా ఈ వేధింపులు ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా శనివారం కమిషనర్ రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్‌ను గెటౌట్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సస్పెండ్ చేస్తానంటూ బెదిరించాడు.

ఏం జరిగిందంటే...

శనివారం నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, అడ్మిన్లు, అమినిటీస్ కార్యదర్శులతో కమిషనర్ పి. విశ్వనాథ్ సమావేశం నిర్వహించారు. ఇదే సందర్భంలో కమిషనర్ రెవెన్యూ విభాగానికి చెందిన సూపరింటెండెంట్ అబ్దుల్ వాజిద్‌ను పన్ను బకాయిదారుల జాబితా అడిగి ఎంత మంది ఉన్నారు. ఎంత కలెక్షన్ వచ్చిందన్నారు. సచివాలయాల్లోని కార్యదర్శులతో మాట్లాడి వివరాలు ఇస్తుండగానే కమిషనర్ చిర్రుబుర్రులాడారు. గెటౌట్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. అవమానంగా భావించిన సదరు సూపరింటెండెంట్ కుటుంబ సభ్యులను పిలిపించుకొని పెట్రోల్‌తో కార్యాలయానికి వచ్చారు. తోటి ఉద్యోగులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పటికే కమిషనర్ వ్యవహారి శైలితో విసిగిన ఉద్యోగులతో పాటు మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయిస్ కూడా సూపరింటెండెంట్‌కు మద్దతుగా నిలిచారు. కమిషనర్ వ్యవహార శైలిపై తాడో పేడో తేల్చుకోవాలని నిర్ణయించుకొని

అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణను బాధిత సూపరింటెండెంట్‌తో పాటు వెళ్లి కలిశారు. కమిషనర్ ఉద్యోగుల పట్ల చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, ఇది మంచి సంప్రదాయం కాదని చెప్పారు. తర్వాత నగర మేయర్ బీవై రామయ్యను కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. కమిషనర్ తీరు మార్చుకోకపోతే పనిచేయలేం అంటూ స్పష్టం చేశారు. మేయర్ వారిని వారించి కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబంలా ఉందామని కలిసికట్టుగా పనిచేద్దామని సూచించారు.

మూకుమ్మడి సెలవుల్లో మున్సిపల్ ఉద్యోగులు ?

అకారణంగా మెమోలు ఇవ్వడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం వంటి చర్యలతో ఉద్యోగులు విసిగిపోయారు. వారం పదిరోజుల్లో కమిషనర్ తీరులో మార్పు రాకపోతే మూకుమ్మడి (సీఎల్)గా సెలవుల్లో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వాస్తవానికి కమిషనర్ పి. విశ్వనాథ్ వచ్చిన తర్వాత కర్నూలు నగరంలో పెద్దగా అభివృద్ధి పనులు, బిల్లుల క్లియరెన్స్ జరగలేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో కన్నా ఇప్పుడే శానిటేషన్ సమస్య జఠిలంగా మారింది. ఈ సమస్య పరిష్కారంపై కమిషనర్ దృష్టి సారించకుండా తమను మానసికంగా వేధిస్తే ఎలా అని దీనిపై త్వరలోనే కర్నూలు మంత్రి టీజీ భరత్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరిని కలిసి చెబుతామని ఉద్యోగులు స్పష్టం చేశారు.

న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలి

పాణ్యం: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఏఈ మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చేపట్టనున్న సమ్మె కరపత్రాలను విద్యుత్ ఉద్యోగులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఏఈ మాట్లాడుతూ కాంట్రాక్టు జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, అరియర్స్ చెల్లించాలన్నారు. జేఎల్ఎం గ్రేడ్–2ను రెగ్యులర్ చేయాలన్నారు. పీఆర్‌సీ అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 6న ఈపీడీసీఎల్ వద్ద, 8న ఏపీఎస్పీడీసీఎల్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 13న చలో విజయవాడ, 15న నిరవధిక సమ్మె ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- అట్టహాసంగా ప్రారంభమైన అటవీ శాఖ ఉద్యోగుల క్రీడలు



మాట్లాడుతున్న కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐఎఫ్ఎస్ వీబీఏ కృష్ణమూర్తి



వాలీబాల్ ఆడుతున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఉద్యోగులు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. పలు క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. కర్నూలు (కర్నూలు, కడప, నంద్యాల డివిజన్) సర్కిల్ అటవీ శాఖ ఉద్యోగుల రెండు రోజుల క్రీడా పోటీలు శనివారం అవుట్ డోర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐఎఫ్ఎస్ వీబీఏ కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించారు. ఆయనతో పాటు నంద్యాల డీఎఫ్‌వో, కర్నూలు ఇన్‌చార్జ్ డీఎఫ్‌వో నాగమనేశ్వరి, ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజశ్వని పలు క్రీడల్లో పాల్గొని ఉత్సాహం పరిచారు. 52 మంది ఉద్యోగులు పలు క్రీడాంశాల్లో పాల్గొన్నారు. డిపార్ట్‌మెంట్ తరుపున ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల ఉద్యోగుల్లో స్నేహభావం, పోటీ తత్వం, టీం వర్క్ పెరుగుతుందన్నారు. మొదటి రోజు అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, క్యారమ్స్, చెస్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో కర్నూలు ఎఫ్ఆర్‌వో విజయకుమార్, డోన్ ఎఫ్ఆర్‌వో ప్రవీణ్‌కుమార్, ఫ్లైయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి స్క్వాడ్ డీఆర్‌వో శ్రీనివాసులు, ఏవోలు అబ్దుల్ సుభాన్, మహమ్మద్ ఏసాన్, షానవాజ్, ఎఫ్ఎస్‌వోలు కిరణ్, మౌలాలి, రాణాప్రతాప్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

కర్నూలు (సెంట్రల్) : జీఎస్టీ ఏయే వస్తువులపై ఎంతెంత తగ్గిందో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి జీఎస్టీ పన్నుల తగ్గింపునకు సంబంధించి అవగాహన కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవగాహన కార్యక్రమాలను మొక్కుబడిగా కాకుండా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ఇందులో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, అడిషనల్ కమిషనర్ కృష్ణ, డీఈఓ శామ్యూల్ పాల్, డీఆర్‌డీఏ పీడీ రమణా రెడ్డి, మెప్మా పీడీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గా మాత నిమజ్జనం

ఓర్వకల్లు: నన్నూరు గ్రామంలోని రాగమయూరిలో కొలువుంచిన దుర్గా మాత అమ్మవారిని శనివారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటలు, వివిధ వేషధారణల్లో కళాకారులు అలరించారు. కల్లూరు అర్బన్ 21వ వార్డులో కొలువైన దుర్గా మాత అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.